క్లుప్తంగా

డీఎస్పీకి ప్రశంస



ఎస్పీ బిందుమాధవ్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న డీఎస్పీ

పత్తికొండ(తుగ్గలి) : విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు, లోక్ అదాలత్ అధిక కేసుల రాజీకి కృషి చేసిన పత్తికొండ డీఎస్పీ బి.వెంకటరామయ్యను జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ప్రశంసించారు. అంకిత భావంతో పనిచేసి శాంతిభద్రతలకు కృషి చేయాలని ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో పలువురు న్యాయవాదాలు డీఎస్పీకి అభినందనలు తెలిపారు.

ఎంపీడీఓగా సీవీ కొండయ్య



మద్దికెర: ఎంపీడీఓగా సీవీ కొండయ్య నియమించినట్లు జిల్లా అధికారులు ప్రకటించినట్లు ఎంపీడీఓ కార్యాలయ వర్గాలు శుక్రవారం తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న నరసింహమూర్తి పదవీ విరమణ కావడంతో పరిపాలన అధికారి స్వర్ణలతకు ఇన్‌చార్జ్‌అప్పగించారు. సాధారణ బదిలీల్లో భాగంగా చిప్పగిరిలో విధులు నిర్వహిస్తున్న సీవీ కొండయ్య బదిలీపై ఇక్కడికి వస్తున్నారన్నాని చెప్పారు.

ఆర్‌అండ్‌బీ డీఈగా శివరుద్రకుమార్



పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండ సబ్ డివిజన్ ఆర్‌అండ్‌బీ డీఈగా శివ రుద్ర కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన నాగ వెంకటేశ్వరరెడ్డి తిరుపతికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కోడుమూరు డీఈ శివరుద్రకుమార్‌ను ఇక్కడ నియమించారు.

ఎన్‌సీసీ కేడెట్స్‌కు సర్టిఫికెట్‌ల ప్రదానం

దేవనకొండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్‌సీసీలో రాణించడంతో ఎన్‌సీసీ–ఏ సర్టిఫికెట్‌లను 28వ ఆంధ్ర బెటాలియన్ జూనియర్ కమాండెంట్ ఆఫీసర్ (జేసీఓ) అలోక్‌కుమార్ శుక్రవారం అందజేశారు. హెచ్‌ఎం ఆధ్వర్యంలో సీటీఓ పాండురంగ విఠల్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జేసీఓ మాట్లాడుతూ పై చదువుల్లో, ఉద్యోగాలు పొందడంలో ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



అక్రమ మద్యం, నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

ఆలూరు రూరల్: కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 4 బాక్సుల కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు ఎస్ఐ నరసింహులు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో సీఐ శ్రీనివాసులు నాయక్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని అగ్రహారం గ్రామం వద్ద హాలహర్వి మండలం మాచనూరు గ్రామానికి చెందిన ఉదయ్ కుమార్, ఆలూరుకు చెందిన నరసింహులుకు అక్రమ మద్యం అందజేస్తుండగా దాడి చేసి వారి నుంచి 384 కర్ణాటక మద్యం (90ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు) స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ వివరించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండల కేంద్రంలోని మారెమ్మవ్వ, రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపామోహన్ శర్మ, గోవిందు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళ హారతులు తదితర పూజలు జరిపించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బాబు అసత్య ప్రచారాన్ని తిప్పికొడదాం

పత్తికొండ/తుగ్గలి : వెంకటేశ్వరస్వామి విశిష్టత, తిరుమల పవిత్రతను రాజకీయ లబ్ధి కోసం అబద్ధ ప్రచారాలతో దెబ్బతీస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రలను తిప్పికొడదామని వైఎస్సార్‌సీపీ తుగ్గలి, పత్తికొండ మండలాల అధ్యక్షులు జిట్టా నాగేష్‌యాదవ్, కారం నాగరాజు అన్నారు. తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం పత్తికొండలో వెంకటేశ్వరస్వామి, తుగ్గలిలో చెన్న కేశవస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు,జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని విభాగాల సభ్యులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

మత సామరస్యానికి ప్రతీక ఎల్లార్తి

- రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- వివిధ రాష్ట్రాల నుంచి కులమతాలకు అతీతంగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో వేడుకలు

> 29న ఆదివారం గంధం (సందల్),
> 30న సోమవారం ఉరుసు,
> 1న మంగళవారం జియారత్ (వేడుకలు ముగింపు)



షేక్షావలి తాత సమాధి



షేక్షావలి దర్గా



షాషావలి దర్గా

హొళగుంద: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. ఈనెల 29 నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు స్వామి వార్ల ఉరుసు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి కుల,మతాలకు అతీతంగా భక్తులు భారీగా తరలివస్తారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య ఆధ్వర్యంలో ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్ నేతృత్వంలో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ బాలనరసిహులు తెలిపారు. ఇక ఉత్సవాలకు సంబంధించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

చరిత్ర..

షేక్షావలి, షాషావలి అరబ్ దేశానికి చెందిన మత ప్రచారకులు. వారు పూర్వం భారత దేశంలో సంచరిస్తూ ప్రజలకు తోచిన సహాయం చేసేవారు. దేశంలో అనేక ప్రాంతాలు తిరిగిన వీరు రాయచూరులో కొద్ది రోజులు గడిపి చివరికి ఎల్లార్తిలో స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. ఇక్కడి ప్రజలకు ఎన్నో సహాయ సహకారాలు అందించిన వారు మహిమలు కల్గి ఉన్నారని ప్రాచుర్యంలో ఉంది. చివరికి వారు ఇక్కడే మరణించడంతో వారి సమాధులను దర్శించుకోవడానికి భక్తుల తాకిడి మొదలైంది. నిత్యం సమస్యలతో సతమతమవుతూ, మానసిక రుగ్మతలతో ఇబ్బంది పడుతున్న వారు ఎల్లార్తిలోని సమాధులను దర్శిస్తే కష్టాలు తీరుతాయనే విశ్వాసం భక్తుల్లో ఉంది.

ఎల్లార్తికి ఇలా చేరుకోవచ్చు..

కర్నూలు నుంచి ఆలూరు మీదుగా ఎల్లార్తికి 127 కి.మీ దూరం ప్రయాణించాలి. ఆదోని మీదుగా 131 కి.మీ ఉంటుంది. హొళగుంద నుంచి 9 కి.మీ, ఆలూరు నుంచి 19 కి.మీ దూరంలో ఎల్లార్తి గ్రామం ఉంది.గుంతకల్, గుత్తి తదితర ప్రాంతాల వారు ఆలూరు మీదుగా ఎల్లార్తి చేరుకోవచ్చు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి, శిరుగుప్ప తదితర పట్టణాల వారు హొళగుంద మీదుగా చేరుకోవచ్చు. ఎల్లార్తికి ఆర్టీసీ బస్సు సౌకర్యలతో పాటు ప్రైవేటు వాహనాలు తిరుగుతాయి.

ఎల్లార్తిలో మరిన్ని దర్గాలు...

ఎల్లార్తిలో షేక్షావలి, షాషావలి దర్గాలను దర్శించుకున్న భక్తులు వాటి పరిసరాల్లో ఉన్న జెండాకట్ట, దాదీమా, దూద్‌పీరాతాతా దర్గాలను కూడా దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. దాదాపు 400 ఏళ్లనాటి చరిత్ర కలిగిన ఈ దర్గాలను పలు రాష్ట్రాల భక్తులు కొలుస్తారు. వేడుకలన్నీ వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో జరుగుతాయి.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



29 నుంచి జరిగే ఎల్లార్తి షేక్షావలి, షాషావలి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య ఆధ్వర్యంలో ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, స్పెషల్ పార్టీ పోలీసులు, లేడీ కానిస్టేబుళ్లతో..దాదాపు వంద మందితో పోలీసు బందోబస్తు నిర్వహిస్తాం. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– బాల నరసింహులు, ఎస్ఐ, హొళగుంద

ఏర్పాట్లు చేస్తున్నాం



29వ తేదీ నుంచి మొదలు కానున్న ఉరుసును వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు కల్పిస్తున్నాం. దాతల సహకారంతో పాటు వక్ఫ్ బోర్డు నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. దివ్యాంగులకు వీల్ చైర్స్, ట్యాంకర్లు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, వాహనాలకు పార్కింగ్ స్థలం ఇలా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం. భక్తులు సంప్రదాయలను పాటిస్తూ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి.

– ఇమ్రాన్, ఈఓ, వక్ఫ్‌బోర్డు, ఎల్లార్తి దర్గాలు

నేటి నుంచి ఆరాధన

తుగ్గలి : మండలంలోని రాతన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పూజారి బ్రహ్మయ్యస్వామి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో భక్తులు ఆయన 41 రోజుల ఆరాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శని, ఆదివారాలు రెండు రోజుల పాటు ఆరాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, భక్తులు తెలిపారు.

సబ్సిడీపై శనగ పంపిణీ చేయాలి

పత్తికొండ(తుగ్గలి) : రబీలో పంటలు సాగు చేసే రైతులకు 50 శాతం సబ్సిడీపై పప్పుశనగ పంపిణీ చేయాలని ఏపీ రైతు జిల్లా కార్యదర్శి రాజాసాహెబ్ కోరారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షులు పెద్ద వీరన్న, కారన్నతో కలిసి శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వీరేష్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ..అధిక వర్షాలతో ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు నీటి ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. దీంతో రబీలో పంటల పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో సబ్సిడీతో సకాలంలో పప్పుశనగ అందజేయాలని కోరారు. లక్ష్మన్న, ఈరన్న పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా మురళీ సుందరరావు

పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండ సబ్ రిజిస్ట్రార్‌గా మురళీ సుందరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆలూరులో పనిచేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఎం మౌలా నందికొట్కూరుకు బదిలీ అయ్యారు.

గ్రంథాలయాలు జ్ఞాన సంపదకు నిలయాలు



గ్రంథాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

చిప్పగిరి: గ్రంథాలయాలు జ్ఞాన సంపదకు నిలయాలని ఎమ్మెల్యే బి.విరూపాక్షి అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలో రూ.28 లక్షలతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో గ్రంథాలయానికి సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో కొనసాతుందని, తమ ప్రభుత్వ హయాంలో నూతన భవనానికి నిధులు మంజూరు చేయడంతో నిర్మాణం పూర్తయిందని చెప్పారు. స్థానికులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ జూటూరు హేమలత,కన్వీనర్ మారయ్య, సర్పంచ్ గోవిందరాజులు, గ్రంథాలయాల సంస్థ జిల్లా కార్యదర్శి ప్రకాష్, ఏఈ లక్ష్మినారాయణ, లైబ్రేరియన్ అబ్దుల్ రసూల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో మంచి పౌష్టికాహారం

వెల్దుర్తి(కృష్ణగిరి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మంచి పోషకాలున్న పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీఓ లూక్ తెలిపారు. మండలంలోని పిక్కిలివానిపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జరిగిన పోషణ మహా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రక్తహీనత నివారించడానికి, సుఖ ప్రసవానికి పూర్తిస్థాయిలో పోషకాహారం అవసరమని, ఆకుకూరలు, కూరగాయాలు, పండ్లు, చిరుధాన్యాలు పూర్తిస్థాయిలో భుజించాలని సూచించారు.

గంజాయి స్వాధీనం.. కేసు నమోదు

పెద్దకడబూరు : మండలంలోని హులికన్వీ గ్రామానికి చెందిన మస్కి చిన్న యల్లప్పపై శుక్రవారం గంజాయి అమ్ముతున్నట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. హులికన్వీ గ్రామానికి చెందిన యల్లప్ప గంజాయి ప్యాకెట్లతో గ్రామం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం దగ్గర తిరుగుతున్నాడు. పోలీస్‌లకు అనుమానం వచ్చి తనిఖీ చేయగా ఆయన దగ్గర 651 గ్రాముల పరిమాణం (90 చిన్న ప్యాకెట్లు) గల గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

క్రమశిక్షణతో మెలిగితే ఉన్నత శిఖరాలకు



మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసులు నాయక్

ఆలూరు రూరల్: విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణతో మెలిగితే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని ఆలూరు సీఐ శ్రీనివాసులు నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలు, పోక్సో చట్టం ,సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడి చదువులకు దూరం కావద్దని చెప్పారు. చిన్నతనం నుంచే మత్తుకు బానిసైతే భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. సరదా కోసం మత్తు పదార్థాలకు అలవాటుపడితే అది వ్యసనంగా మారుతుందని తెలిపారు. తోటి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిచడం నేరమన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆలూరు ఎస్ఐ నరసింహులు, ప్రిన్సిపాల్ రాఘవరావు, వైస్ ప్రిన్సిపాల్ వీరేష్ పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి



చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్న అధికారులు

మద్దికెర : వ్యక్తిగతంతో పాటు పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ స్వర్ణలత, ఎంపీపీ అనిత, సర్పంచులు బండారు సుహాసిని, ఆంజనేయులు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పారిశుధ్య సిబ్బంది వచ్చినపుడు అందజేయాలని సూచించారు. చెత్తబుట్టలను ఆయా గ్రామ పంచాయతీలకు అందజేశామని, వారు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తారని చెప్పారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, కార్యదర్శులు శివకుమార్, అరుణకుమారి, వన్నూర్‌వలి పంచాయతీ సభ్యులు బాలచంద్ర, లక్ష్మినారాయణ,ఉష పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన



ఆలూరులో డ్రమ్ములోని నీటిని పారబోస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలూరు రూరల్: దోమలు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. శుక్రవారం ఆలూరులో ఫ్రైడే – డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉంచుకోరాదన్నారు. డ్రమ్ముల, పాత టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉంటే లార్వా వృద్ధి చెంది దోమలు ప్రబలుతాయన్నారు. అలాగే ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఉతికిన బట్టలు ఎప్పటికప్పుడు ఆరవేయాలన్నారు. రోజు విడిచి రోజు జ్వరం వస్తే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. నీటిని కాచి చల్లార్చి వడపోసి తాగాలని తెలిపారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



నీటిని పారబోయిస్తున్న మలేరియా సబ్‌యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు

వెల్దుర్తి(కృష్ణగిరి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. వెల్దుర్తిలోని మూడవ సచివాలయం పరిధిలో శుక్రవారం ఆయన వైద్యాధికారి ఎంపీ భువనతేజతో కలిసి డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటి ముందు ఉన్న నీటి తొట్టెలను పరిశీలించి లార్వా ఉన్న నీటిని పారబోయించారు. మురుగు కాల్వల్లో అబేట్ ద్రావణం పిచికారీ చేయించారు. సూర్‌వైజర్ ఆనమ్మ, మోహన్, సీహెచ్‌ఓ హసీనా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక





రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కాలువ యువరాజ్, విద్యార్థినితో ఉపాధ్యాయులు

కృష్ణగిరి: మండలంలోని కటారుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని రాజేశ్వరి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం గోవిందరెడ్డి తెలిపారు. కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన అథ్లెటిక్ అండర్–14 విభాగంలో రాజేశ్వరి 600 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొననుందని చెప్పారు. విద్యార్థిని, ఫిజికల్ డైరెక్టర్ రంగస్వామిని శుక్రవారం ఉపాధ్యాయులు, పీఎంసీ చైర్మన్ పాండురంగడు, గ్రామస్తులు అభినందించారు.

ఆలూరు రూరల్: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ లాంగ్ జంప్, 400 మీటర్ల పరుగు పందెం పోటీలకు ఆలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం సుజాత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడారు. గురువారం కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి అండర్–14 లాంగ్ జంప్‌లో జ్యోతి ఉత్తమ ప్రతిభ చాటింది. అలాగే అండర్–14 విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో దేవి మొదటి స్థానంలో నిలించిందన్నారు. ఎంపికై న విద్యార్థినులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పీడీ సరోజ, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.

అండర్–19 క్రికెట్ పోటీలకు ఎంపిక

మద్దికెర : స్థానిక శ్రీవిద్యాసాయి జూనియర్ కళాశాలలో మొదటి ఇంటర్ చదువుతున్న కాలువ యువరాజ్ రాష్ట్రస్థాయి అండర్–19 క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ యజ్ఞం వెంకట్‌మాధవ్, ప్రిన్సిపాల్ సునీత శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ యువరాజ్ మూడు సంవత్సరాల నుంచి స్కూల్ గేమ్స్‌లో రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నాడన్నారు. విద్యార్థిని, వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్‌ను ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.



పోటీలకు ఎంపికైన ఆలూరు విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వెల్దుర్తి(కృష్ణగిరి): మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో అండర్–17 విభాగం పరుగు పోటీల్లో భార్గవి, అర్చన, 800 మీటర్ల పరుగులో మాధురి, షాట్‌పుట్‌లో అంకితరాణి ప్రతిభ చూపారు. దీంతో వీరు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ షబానాబేగం తెలిపారు.

మాంసం దుకాణాలను తొలగించండి

హొళగుంద: నెరణికి గ్రామంలో ఆంజనేయస్వామి, మారెమ్మ ఆలయాల పరిసరాల్లో ఉన్న మాంసం దుకాణాలను తొలగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్, సీనియర్ నాయకుడు చిదానంద తదితరులు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మాంసం దుకాణాల కారణంగా అక్కడి వ్యర్థాలను కుక్కలు తీసుకొచ్చి ఆలయాల పరిసరాల్లో పడేస్తున్నాయన్నారు. బన్ని దేవరగట్టు ఉత్సవాల ముగింపు రోజు ఆంజనేయస్వామి ఆలయ కట్టపై మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను కొద్దిసేపు ఆశీనులు గావించి గ్రామంలోకి తీసుకెళ్తారన్నారు. అలాంటి చోటు వద్ద ఇలా మాంసం వ్యర్థాలు పడటం మంచిది కాదన్నారు. వెంటనే గ్రామంలో విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. నెరణికి గ్రామస్తులు జాంటీ వీరేష్, గిరెప్ప, గాదిలింగ, సాదన్న, పులి మల్లయ్య, పవనాచారి ఉన్నారు.

కోలుకోలేక రైతు మృతి

వెల్దుర్తి(కృష్ణగిరి): అప్పుల బాధతో ఆత్మహత్యకు యత్నించిన ఓ రైతు చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు... వెల్దుర్తి మండలంలోని రామళ్లకోట గ్రామానికి చెందిన బోయ హనుమంతు (43) తమకున్న నాలుగు ఎకరాల పొలంతోపాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయం, కుటుంబ పోషణకు దాదాపుగా రూ.8లక్షల వరకు అప్పులు చేశారు.అప్పులు ఎలా తీర్చాలనే మనోవేదనతో ఈ నెల 23న ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



పత్తికొండ కేజీబీవీలో మొక్క నాటుతున్న ఎంఈఓలు



దేవనకొండలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్

పత్తికొండ(తుగ్గలి) : ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షిస్తే పర్యావరణ మనుగడ సాధ్యమవుతుందని ఎంఈవోలు తిమ్మారెడ్డి, రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక కేజీబీవీ ఆవరణలో జైభీం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారు మొక్కలు నాటారు. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో సైతం ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడం, సంరక్షించడాన్ని అందరూ బాధ్యతగా తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ, గురుకుల పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, ఫౌండేషన్ అధ్యక్షుడు సోమన్న, బీజేవైఎం నాయకుడు నరేష్, జేబీవైఎఫ్ నాయకులు సురేష్, రవికుమార్ పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

దేవనకొండ: ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాలశర్మ, దేవనకొండ గ్రామవాసి సదాశివరావు పిలుపునిచ్చారు. శుక్రవారం గుంటూరు ముద్దను రామారావు వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు సదాశివరావు 25 మామిడి మొక్కలను విద్యార్థులతో కలిసి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నాటించారు. ఎం.కృష్ణమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కర్లకుంటలో ప్రత్యేక పూజలు

కృష్ణగిరి: తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ ఆరోపణలను ఖండిస్తూ మండలంలోని కర్లకుంట గ్రామంలోని తిరుమలరాయుడు దేవాలయంలో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి శుక్రవారం తెలిపారు. కార్యక్రమాన్ని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో చేపడుతున్నామని, మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

బాలికలకు ఆర్థిక సాయం

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో దూదేకుల ఆసాబీ, సబియా, ఆఫ్రిన్ తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలారు. స్పందించిన ఆలూరు అడ్వకేట్ షేక్షావలి బాలికల పేరు మీద రూ.50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ బాండును శుక్రవారం వారికి అందించారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే బాలికలు తల్లిదండ్రులను కోల్పోవడం బాధాకరమన్నారు. బాధితా కుటుంబానికి తమవంతుగా సాయం అందజేసినట్లు చెప్పారు. గ్రామస్తులు ముస్తఫా, మాబాషా ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

దేవనకొండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మై విజన్ ఇన్ ఇండియా–2047, స్వర్ణాంధ్ర–2047 పై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు హెచ్‌ఎం వై.మద్దిలేటి, ఉపాధ్యాయిని గంగావతి శుక్రవారం తెలిపారు. పోటీల్లో ప్రథమ స్థానంలో రెయిన్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎం.వర్షిత్, ద్వితీయ స్థానంలో దేవనకొండ కేజీబీవీ స్కూల్ విద్యార్థిని ఎన్.సుమతి (9వ తరగతి), తృతీయ స్థానంలో ఎఫ్ ఆర్ హైస్కూల్ విద్యార్థి ఎస్.మన్సూర్‌బాషా (10వ తరగతి విద్యార్థి) నిలిచారన్నారు. వారికి బహుమతులను అందజేయనున్నట్లు చెప్పారు.